ప్రజాశక్తి
మంగళవారం 27 ఆగస్టు 2024
5
విజయనగరం



యోగా శిక్షకులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం

ప్రభుత్వ హోమియో వైద్యశాల ఆధ్వర్యాన రాకోడులోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో యోగా శిక్షకులుగా పనిచేసేందుకు ఆసక్తి కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ పి. సత్యేంద్ర కుమార్ తెలిపారు. యోగా శిక్షకులుగా పనిచేసేవారు ఎమ్మెస్సీ యోగా, పీజీ డిప్లొమో ఇన్ యోగా , డిప్లొమో ఇన్ యోగాలో అనుభవం ఉన్నవారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి గంటకు రూ 250 గౌరవవేతనం చెల్లిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 31 లోగా ప్రభుత్వ హోమియో వైద్యశాల రాకోడులో అందజేయాలని తెలిపారవు. మరిన్ని వివరాలకు 9440996888, 8639097379 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.



వేపాడ మండలంలోని కొండ గంగుబూడి రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. నిరుపేద కుటుంబాలకు ఇచ్చిన డి-పట్టా భూముల్లోనూ రియల్ ఎస్టేట్ రాబంధులు వాలిపోయి వాటిని స్వాధీనం చేసుకుంటున్నారు. ఇందులో రెవెన్యూ అధికారులు, కొందరు ప్రజాప్రతిధుల పాత్ర ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలో డి-పట్టా భూములు సుమారు 454 ఎకరాలు, ప్రభుత్వ భూములు 14.94 ఎకరాలు చేతులు మారినట్లు తెలుస్తోంది. సబ్‌జైలు నిర్మాణానికి కేటాయించిన 90 ఎకరాలు కూడా అన్యాక్రాంతం కావడం గమనార్హం

సబ్‌జైలుకు కేటాయించిన 90 ఎకరాలూ హాంఫట్

పేదల డి-పట్టా భూములపై రియల్ రాబందులు

రెవెన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధుల హస్తం

కెజి పూడి రెవెన్యూపరిధిలో ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం

ప్రజాశక్తి-వేపాడ

నిరుపేదలకు ప్రభుత్వం డి- పట్టా భూములు మంజూరు చేసి ఆ భూమిని అభివృద్ధి చేసుకొని కుటుంబాల పోషించుకోవాలని ఉద్దేశంతో ప్రభుత్వం 2005లో కొండగంగుబూడి రెవెన్యూ పరిధిలో 9 గిరిజన గ్రామాలకు చెందిన 65 మంది నిరుపేదలకు సుమారు వంద ఎకరాలకు వరకు ఇచ్చింది. ఈ భూములు ఎత్తు పల్లాలతో ఉండడంతో చదును చేసి పండ్ల తోటలు వేసుకుని వచ్చిన ఆదాయంతో కుటుంబాలను పోషించుకునేందుకు సమగ్ర భూ అభివృద్ధి పథకం ద్వారా సుమారు కోటి రూపాయలు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టారు. స్వయంగా ప్రభుత్వమే జీడి, మామిడి, మొక్కలు నాటించింది. ఆ ప్రాంతమంతా ఉద్యానతోటలతో కళ కళలాడడంతో ఈ భూములపై రియల్ ఎస్టేట్‌వ్యాపారుల కళ్లు పడ్డాయి. పట్టాదారులకు ఎకరాకు రూ.40వేల నుండి రూ.50 వేలు వరకు అప్పులిచ్చి తమ ఆధీనంలో ఈ భూములను ఉంచుకున్నారు. జరుగుతున్న ఈ తతంగంపై కొంతమంది జిల్లా అధికారుల దృష్టికి తీసుకు వెళ్లగా అధికారులు దర్యాప్తుకు వచ్చినప్పుడల్లా తమ భూములను తామే సాగు చేసుకుంటున్నామని పేదలను భయపెట్టి చెప్పించారు. ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హయాంలోనే ఈ భూ అక్రమాలు జరుగుతున్నాయని అప్పటి మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆరోపణ చేశారు. తనను గెలిపిస్తే ఆ భూములను తిరిగిపేదలకు ఇప్పిస్తానని పలు సమావేశాల్లో లలితకుమారి చెప్పారు. తీరా ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత ఈ భూముల గురించి పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. టిడిపి ప్రభుత్వం అదికారంలోకి వచ్చిన తరువాత ఈ భూ అక్రమాలపై రాష్ట్ర రెవెన్యూ ప్రత్యేక అధికారి ఆర్‌పి సిసోడియా దృష్టికి పలువురు తీసుకెళ్లగా,ఆయన స్పందించారు. ఫ్రీహోల్డ్ భూములు-అసైన్డ్ భూములు రిజిస్ట్రేషన్‌పై రిజిస్టర్ కార్యాలయంలో ఇటీవల తనిఖీ చేశారు. పలు అక్రమాలు జరిగినట్లు నిర్ధారించి సంబంధిత సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేశారు. అంతవరకు బాగానే ఉన్నా. ప్రభుత్వం ఇస్తున్న పేద కుటుంబాల భూములు మళ్లీ తిరిగి పెద్దల చేతుల్లోకి వెళుతున్నాయి. దీనంతటికీ కారణం మధ్య దళారులు, రెవెన్యూ అధికారులేనని ఆరోపణలు వస్తున్నాయి. ఇదే రెవెన్యూ పరిధిలో సబ్ జైలు నిర్మాణానికి 90 ఎకరాలు సేకరించారు. ఆ భూమి కూడా నామరూపాలు లేకుండా పోయింది. కొంతమంది ఆ భూమిని ఆక్రమించేశారు. విజయ రామ సాగర్ బోడిమెట్టకు అనుకుని సుమారు 50 ఎకరాలు డి-పట్టా భూములు చేతులు మారాయి. విజయరామ సాగర్‌కు మారిక కొండ నుంచి వచ్చే గెడ్డ వాగులను కూడా ఆక్రమించేశారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులే ఆక్రమణదారులకు కొమ్ముకాస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. విజయ రామ సాగర బోడిమెట్టుగా అనుకుని సుమారు 50 ఎకరాలు డి పట్టా భూములు సైతం చేతులు మారాయి. విజయరామ సాగరకు మారిక కొండ నుంచి వచ్చే గడ్డ వాగులు కూడా ఆక్రమించేశారు.

అన్యాక్రాంత భూములను బాధితులకు అప్పగించాలి



ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం వెనుక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాత్ర ఉంది. రియల్ ఎస్టేట్‌వ్యాపారులకు కొంతమంది రెవెన్యూ అధికారులే మధ్య వర్తులుగా వ్యవహరిస్తున్నారు. పేదలను మభ్యపెట్టి, బెదిరించి భూములను స్వాధీనం చేసు కుంటున్నారు. ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం అన్యాక్రాంతమైన భూములను తిరిగి లబ్ధిదారులకు అప్పగించాలి. ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి. లేదంటే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తాం.

తమ్మినేని సూర్యనారాయణ
సిపిఎం జిల్లా కార్యదర్శి



డాక్టర్ పివిజి రాజు జీవిత విశేషాలపై ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర రాష్ట్రమంత్రులు, స్పీకర్, ఎంపిలు, ఎమ్మెల్యేలు

స్ఫూర్తి ప్రదాత పివిజి

పుస్తకావిష్కరణ సభలో వక్తలు

ఘనంగా శతజయంతోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం కోట



మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

భావి తరాలకు, ప్రస్తుత తరానికి స్ఫూర్తి కలిగించిన మాజీ ఎంపి డాక్టర్ పివిజి రాజు సమాజానికి విశిష్ట సేవలు అందించారని పలువురు వక్తలు కొనియాడారు. ఆ మహనీయుని జీవిత చరిత్ర అందరికీ తెలియాల్సిన అవసరం వుందని అన్నారు. పివిజి రాజు శత జయంతి ఉత్సవాల సందర్భంగా మాన్సాస్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కోటలో నిర్వహించిన కార్యక్రమం లో పివిజి రాజు జీవిత విశేషాలు, ఆయన చేసిన సేవలపై ఆయన కుమారుడు, కేంద్ర మాజీమంత్రి పి.అశోక్‌గజపతిరాజు ముద్రించిన పుస్తకాన్ని పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపిలు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ సమాజం కోసం తన సంపద నంతటినీ ధారపోసిన గొప్ప వ్యక్తి పివిజి రాజు అన్నారు. రాబోయే తరం వారి చదువుల కోసం తన కోటను చిన్న వయసులోనే దానం చేసిన వ్యక్తని కొనాయడారు. రాజరిక భోగాలను విడిచిపెట్టి రాజకీయాల్లో సాధారణ వ్యక్తిగా కొనసాగిన నాయకుడు అని చెప్పారు. ఆయన ఎందరికో విద్యాదానం చేసిన మహోన్నత వ్యక్తి మాత్రమే కాదని, మానవతా వాది అని చెప్పారు. కోరుకొండ సైనిక్ స్కూల్ ఆయన చొరవ వల్లే ఈ ప్రాంతంలో ఏర్పాటయ్యిందని చెప్పారు. సమాజానికి చేసిన విశిష్ట సేవలను ఒకే చోటికి తీసుకురావడంలో వారు చేసిన కృషికి సంతోషాన్ని వ్యక్తపరిచారు. కేంద్ర పౌర విమానయానశాఖా మంత్రి కె.రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ విద్యను పెంపొందించడం ద్వారా వెనుకబాటు తనాన్ని నిర్మూలించవచ్చని పివిజి రాజు నిరూపించారని, దీనిని స్ఫూర్తిగా తీసుకుని ఉత్తరాంధ్రలో విద్యావకాశాలు పెంపొందించి వెనుకబాటు తనం పోగొట్టే దిశగా కృషి చేయాలని పిలుపు ఇచ్చారు. నేటి తరం ప్రజా ప్రతినిధులు అంతా కలిసి పనిచేసి ఆయన ఆశయాలు ముందుకు నడిపిస్తామని చెప్పారు. వ్యవసాయశాఖా మంత్రి కె.అచ్చెన్నాయుడు మాట్లాడుతూ డా.పి.వి.జి. ఆశయాలను అశోక్ గజపతిరాజు ముందుకు తీసుకు వెళ్తున్నారని పేర్కొన్నారు. పజా జీవితంలో ఎన్ని పదవులు అనుభవించినా భేషజాలు లేకుండా సాధారణ వ్యక్తిగా పివిజి వ్యవహరించారనిమాజీ స్పీకర్ ప్రతిభా భారతి అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, అనకాపల్లి ఎం.పి. సి.ఎం.రమేష్, విశాఖపట్నం ఎం.పి. శ్రీభరత్, తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎం.పి. కలిశెట్టి అప్పల నాయుడు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఉత్తరాంధ్ర జిల్లాల శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, మాజీ ఎమ్మెల్యేలు, కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, విజయనగరం ఎస్ పి. వకుల్ జిందాల్, ఉత్తరాంధ్ర జిల్లాల టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన 300 మంది సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున రూ.15 లక్షలు స్కాలర్ షిప్ మొత్తాని ప్రముఖులు చేతుల మీదుగా అందజేశారు. పుస్తక ప్రచురణ కర్త అయిన హైదరాబాద్ బుక్ ట్రస్ట్ అధ్యక్షురాలు గీతా రామస్వామిని సత్కరించారు. అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పివిజి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని 300 మంది విద్యార్థులకు స్కాలర్ షిప్ లు అందజేయ నున్నట్టు చెప్పారు.



స్వీపింగ్ మిషన్ వాహనాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి

పరిశుభ్రతకు పెద్దపీట

- రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- కార్పొరేషన్‌లో స్వీపింగ్ మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరాల్లో పరిశుభ్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర చిన్న మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. నగరంలో రోడ్లను యంత్రాల ద్వారా శుభ్రం చేసేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎన్. కాప్, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.30కోట్లతో కొనుగోలు చేసిన రెండు స్వీపింగ్ మిషన్లను మంత్రి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వాడుతున్న అనేక యంత్రాలు రిపేరులో ఉన్నాయని, వాటి స్థానంలో కొత్త వాటిని కొనుగోలు చేయటం, వినియోగానికి అవకాశం ఉన్న వాటిని రిపేరు చేయించి తిరిగి వాడతామని చెప్పారు. తమ ప్రభుత్వం శుభ్రతకు అధిక ప్రాధాన్విస్తుందని అందుకోసమే స్వచ్ఛంద కార్పొరేషన్ ద్వారా అనే అనేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు, అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు, పలువురు టిడిపి నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

గంజాయి లింకుల ఛేధనకు బృందాలు

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి- విజయనగరం కోట

జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో నమోదై, దర్యాప్తులో ఉన్న కేసుల్లో నిందితుల లింకులను ఛేధించేందుకు, ఆయా కేసుల్లో మరింత పురోగతి సాధించేందుకు ఎస్ఐల నేతృత్వంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ఇతర రాష్ట్రాలకు పంపినట్లుగా జిల్లా ఎస్‌పి వకుల్ జిందల్ తెలిపారు. ఇటీవల జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లలో నమోదై, దర్యాప్తులో ఉన్న కేసులను జిల్లా ఎస్‌పి సోమవారం సమీక్షించారు. ఆయా కేసుల్లో ఇంతవరకు చేపట్టిన దర్యాప్తు, సాధించిన పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తులో ఉన్న గంజాయి కేసుల్లో ఇప్పటి వరకు అరెస్టు అయిన నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు ఆయా కేసులతో సంబంధం ఉన్న ఇతర నిందితుల లింకులను ఛేధించేందుకు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. గంజాయిని ఎక్కడ, ఎవరివద్ద నుండి కొనుగోలు చేసింది, కొనుగోలులో సహకరించిన వ్యక్తులు, మధ్యవర్తులుగా వ్యవహరించిన వ్యక్తుల వివరాలు, వారు ఎవరికి విక్రయాలు జరిపేది, ఎవరు వినియోగించేది అన్న వివరాలను రాబట్టాలన్నారు. ఇందులో భాగంగా ఐదుగురు ఎస్ఐలతో ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసామన్నారు. ఈ బృందాలు ఒడిస్సా, చత్తీస్ ఘడ్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్ళి, గంజాయి కేసులతో ప్రమేయం ఉన్న ఇతర వ్యక్తుల సమాచారాన్ని రాబట్టనున్నాయని చెప్పారు. ఈ బృందాల గంజాయి కేసుల్లో ఇప్పటి వరకు సాధించిన సమాచారాన్ని మరింత విస్తృతం చేసి, ఆయా కేసులతో ప్రమేయం ఉన్న సూత్రధారులు, ఇతర నిందితుల లింకులను ఛేధించాలని ఆదేశించారు. జిల్లా ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన నెల రోజుల వ్యవధిలోనే జిల్లాలో గంజాయి అక్రమ రవాణకు పాల్పడుతున్న వారిపై 22 గంజాయి కేసులు నమోదు చేసి, 65మంది నిందితులను అరెస్టు చేసామని తెలిపారు. వీరితోపాటు గంజాయిని సేవిస్తున్న మరో 35 మందిని, వారికి గంజాయిని తక్కువ మొత్తంలో విక్రయిస్తున్న 27మంది చిన్న వ్యాపారులను (పెడ్లర్స్) అరెస్టు చేసి, రిమాండు కు తరలించామన్నారు. గంజాయిని సమూలంగా నిర్మూలించేందుకు ఇప్పటికే జిల్లా పోలీసు యంత్రంగా కఠిన చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా గతంలో బొడ్డవర వద్ద ఉన్న ఒక చెక్ పోస్టుకు అదనంగా మరో నాలుగు చెక్ పోస్టులను పాత బొబ్బిలి, పిట్టాడ, తుమ్మికాపల్లి, కొట్టక్కి వద్ద ఏర్పాటు చేసామన్నారు. వీటితోపాటు డైనమిక్ వాహన తనిఖీలను ఆకస్మికంగా, జిల్లా వ్యాప్తంగా వేరు వేరు ప్రాంతాల్లో చేపడుతున్నామని వివరించారు. ఈ సమావేశంలో పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ఫార్మా కంపెనీ ప్రమాదంలో

వంగర వాసి మృతి

ప్రజాశక్తి-వంగర



మృతుడు సూర్యనారాయణ (ఫైల్)

విశాఖ జిల్లా పరవాడ సెజ్‌లోని సినర్జిన్ ఫార్మా కంపెనీలో ఈనెల 23న జరిగిన ప్రమాదంలో గాయపడిన విజయనగరం జిల్లా వంగర మండలం కోనంగిపాడు గ్రామానికి చెందిన కొవ్వాడ సూర్యనారాయణ (38) ఇండస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కంపెనీలోని రియాక్టర్ కెమికల్ లీకవ్వడంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు, జిల్లాలోని వంగర మండలం కోనంగిపాడుకు చెందిన ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో జార్ఖండ్‌కు చెందిన ఇద్దరు కార్మికులు మృతి చెందారు. తాజాగా సూర్యనారాయణ కూడా కన్ను మూయడంతో విష యం తెలుసు కున్న కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. హుటాహుటిన విశాఖ తరలివెళ్లారు. మృతదేహాన్ని చూసి రోదించారు. సూర్యనారాయణ పదేళ్ల క్రితం బతుకు తెరువు కోసం కంపెనీలో పనిచేసేందుకు పరవాడ వెళ్లాడు. ఆయనకు భార్య సునీత, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు పారంనాయుడు, గౌరమ్మ ఉన్నారు. భార్య సునీత 15రోజుల క్రితమే మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం ఆమె శ్రీకాకుళంని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు.



ఆస్పత్రి వద్ద రోధిస్తున్న సూర్యనారాయణ తండ్రి



రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌కు చిత్రపటం అందజేస్తున్న నిర్వాహకులు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

పాల్గొన్న మంత్రి కొండపల్లి

ప్రజాశక్తి-విజయనగరం కోట

శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం నగరంలో ఘనంగా జరిగాయి. ప్రబోధసేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక, విజయనగరం శాఖ ఆధ్వర్యంలో సోమవారం గురజాడ కళాభారతిలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శ్రీ కృష్ణుని బోధనలు తెలుసుకోవాలని, అన్ని మతాల సారాంశం ఒకటేనని, అదే శ్రీకృష్ణుని బోధ అని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, బాలల హక్కుల రాష్ట్ర కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి, ప్రబోధసేవా సమితి, ఇందూజ్ఞాన వేదిక అధ్యక్షులు వానపల్లి శంకర రావు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా యాదవ సంఘం కల్యాణ మండపంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు పాల్గొన్నారు. టిడిపి నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, అనురాధ బేగం నాయకులు పాల్గొన్నారు.

స్కూలు ఆయాలకు బకాయి జీతాలు చెల్లించాలి

2న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల శానిటేషన్ వర్కర్లకు 5 నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ సెప్టెంబర్ 2న సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని సిఐటియు జిలా లకార్యదర్శి ఎ.జగన్మోహన్‌రావు, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె బేగం, వై.నందిని తెలిపారు. సోమవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగన్మోహన్ మాట్లాడారు. ఏప్రిల్ నుంచి జీతాలు బకాయిలు ఉన్నాయని, అరకొరగా ఇచ్చే రూ.6వేతనం కూడా సకాలంలో ఇవ్వకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. ఫుల్ టైం పనిచేస్తున్న తమకు ఇఎస్ఐ, పిఎఫ్, మెటర్నిటీ లీవులు, సిక్ లీవులు, యూనిఫామ్, గుర్తింపు కార్డులు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు.. ప్రభుత్వ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లందరూ ఈ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో స్కూలు ఆయాలు ఉమా, పార్వతి, విజయమ్మ, శారద , సత్యవతి, శ్రీదేవి, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు, ఆయాలు

యుపిఎస్ వద్దు ఒపిఎస్‌నే అమలు చేయాలి : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఏకీకృత పెన్షన్ విధానం వద్దని, పాత పెన్షన్ విధానమే అమలు చేయాలని అఖిల భారత విద్యా సంఘాల ఉపాధ్యక్షులు వై.సత్యం, ఎపిటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎ.సదాశివరావు డిమాండ్ చేశారు. ఎపిటిఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం అధ్యక్షులు ఎం.బలరాం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సేవలు అందించే వారికి ఉద్యోగ విరమణ అనంతరం ఇచ్చే పెన్షన్‌ను యుపిఎస్ పేరుతో సక్రమంగా అమలు చేయకుండా చేసే ఈ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేసే జీవో 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలను విలీనం చేసే విధానాన్ని మానుకోవాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.ఈశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ వి పైడిరాజు సంఘం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సదాశివరావు

రేపు వాలీబాల్ అకాడమీకి ఎంపికలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 28 తేదిన స్థానిక రాజీవ్ గాంధీ క్రీడా మైదానంలో సాయి వాలీబాల్ అకాడమీకి ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరిబాబు, కెవిఎఎన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల బాల బాలికలకు విశాఖపట్నం లో జరిగే ఎంపికలకు పంపేందుకు రాజీవ్ క్రీడా మైదానంలో ఎంపికకు హాజరు కావాలని తెలిపారు. వయసు 14 సంవత్సరాల నుండి 16 సంవత్సరాల లోపు వారై ఉండాలి. బాలురు 185, బాలికలకు 170 సెంటీమీటర్ల ఎత్తు కలిగి ఉండాలని తెలిపారు. వివరాలకు 8919421590, 9550785141 ను సంప్రదించాలని పేర్కొన్నారు.

నేటి నుంచి పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జనసేన పార్టీ అధినేత, ఉపముఖ్య మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వారోత్సవాలను ఈనెల 27 నుంచి సెప్టెంబర్ 2వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు, జనసేన సీనియర్ నాయకులు త్యాడ రామ కృష్ణారావు (బాలు) తెలిపారు. మంగళవారం ఇప్పిలివీధిలో పారిశుధ్య కార్యక్రమం, పారిశుధ్య కార్మికులకు సన్మానం, 28న ఇంటింటికీ మొక్కలు పంపిణీ, 29న కంటోన్మెంట్‌లో మొక్కలు నాటే కార్యక్రమం, 30న నిరాశ్రయులకు, భవన నిర్మాణ కార్మికులకు అన్నదానం, 31న లంకాపట్నంలో మెగా వైద్య శిబిరం, కేన్సర్‌పై అవగాహనా కార్యక్రమం, సెప్టెంబర్ 1న మొక్కలు నాటే కార్యక్రమం, 2న సర్వమత ప్రార్థనలు, కోట వద్ద మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు మెగా ఫ్యామిలీ అభిమానులు, జనసేన కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నేడు జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా పరిషత్ 1 నుండి 7వ స్థాయీ సంఘ సమావేశాలు మంగళవారం ఉదయం 11 గంటల నుంచి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతాయని సిఇఒ ఎల్‌ఎన్‌వి శ్రీధర్ రాజా తెలిపారు. స్థాయీ సంఘాల సభ్యులు, సంబంధిత జిల్లా అధికారులు ఈ సమావేశాలకు హాజరు కావాలని కోరారు.



ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎజిఎం మనోజ్‌కుమార్

నిరుద్యోగులకు స్వయం ఉపాధి

ప్రజాశక్తి - కొత్తవలస

గ్రామాలలో నిరుద్యోగ యువతకు స్కిల్ టోర్నమెంట్ కోర్స్ ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చుని, ఈ కోర్సు సద్వినియోగం చేసుకోవాలని శారదా కంపెనీ (ఎజిఎం) మనోజ్ కుమార్ ఆచార్య అన్నారు. కంటకాపల్లి పంచాయతీలో శారద నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో శిక్షణ పూర్తయిన విద్యార్థులకు సోమవారం ఆయన ధ్రువ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తయిన 42 మంది విద్యార్థులకు ధ్రువ పత్రాలు అందించారు. ఆయన మాట్లాడుతూ నూతన కోర్సులను ప్రారంభించబోతున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో టైలరింగ్ 15 మంది, బ్యూటిషన్ 12 మంది, కంప్యూటర్ శిక్షణ పొందిన 15 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు స్వయం ఉపాధి పొందే విధంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కంటకాపల్లి సర్పంచ్ భర్త మదిన అప్పల రాం, కంపెనీ సీనియర్ మేనేజర్ వేణు, సహాయక మేనేజర్ (హెచ్ఆర్) శంకర్రావు, హెచ్ఆర్ ఆఫీసర్ సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో చేసిన సేవలే నిలుస్తాయి

ప్రజాశక్తి- బొండపల్లి

విధి నిర్వహణలో అంకిత భావంతో చేసిన సేవలే స్థిర స్థాయిగా నిలుస్తాయని గజపతినగరం సిఐ జివివి. రమణ అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో బొండపల్లి ఎస్ఐ యు. మహేష్ అధ్యక్షతన బదిలీపై వెళ్ళిన ఎస్ఐ కె.లక్ష్మణ రావుకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సిఐ రమణ మాట్లాడుతూ ఎస్ఐగా లక్ష్మణ రావు అతి తక్కువ కాలంలోనే తన విధులను చక్కగా నిర్వర్తించారన్నారు. ఒక పక్క శాఖాపరమైన విధులను నిర్వహిస్తూ మరో పక్క చెరగని చిరునవ్వుతో ప్రజల హృదయాలలో చోటు సంపాదించడం అభినందించదగ్గ విషయమన్నారు. బదిలీ సర్వసాధారణం అని గజపతినగరంలో కూడా ఎస్ఐగా మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ బుర్జివలస ఎస్ఐ రాజేశ్వర రావు, బొండపల్లి ఎస్ఐ యు. మహేష్, ఎఎస్ఐ లెంక గోపీనాథం లక్షణ రావు సేవలను కొనియాడారు. అనంతరం ఎస్ఐ కె. లక్షణ రావును శాలువా కప్పి సన్మానించారు.



డెంకాడ: ప్రశంసా పత్రాలు అందుకున్న వారితో టిడిపి నాయకులు

టిడిపి కార్యకర్తలకు ప్రశంసా పత్రాలుం

ప్రజాశక్తి - నెల్లిమర్ల, డెంకాడ

నెల్లిమర్ల నియోజకవర్గంలో మన టిడిపి యాప్‌లో బాగా పనిచేసిన వారికి నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇంచార్జి కర్రోతు బంగారు రాజు స్థానిక డెంకాడ టిడిపి కార్యాలయంలో ప్రశంస పత్రాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి మరెన్నో సేవలు అందించాలని, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ప్రజలకు ప్రభుత్వానికి అనుసంధానకర్తలుగా పని చేయాలని ఈ యాప్ ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేయాలని చెప్పారు. మన టిడిపి యాప్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచిన అలుగోలు గ్రామానికి చెందిన బొమ్మిడి రామును పలువురు అభినందించారు. జిల్లా టిడిపి సీనియర్ నాయకులు సువ్వాడ రవిశేఖర్, విజయనగరం పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి తమ స్వగృహం పద్మావతి నగర్ లో రాముని అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మహంతి చిన్ననాయుడు, రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మునాయుడు, డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు, మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ, నాయకులు పాణిరాజు, డెంకాడ టిడిపి మండల అధ్యక్షులు పల్లె భాస్కర రావు, భోగాపురం మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, పూసపాటిరేగ మండల అధ్యక్షులు మహంతి శంకర్రావు, ఆకిరి ప్రసాద్, అలుగోలు మాజీ ఎంపిటిసి కురిమినేని దివాకర్ రావు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి వరప్రసాద్ ఎంపిక

ప్రజాశక్తి- శృంగవరపు కోట

మండలంలోని ధర్మవరం హైస్కూల్ ప్లస్‌లో పదో తరగతి చదివిన వెదురుపర్తి వరప్రసాద్ ఒంగోలు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు హెచ్ఎం బి ఉమామహేశ్వరరావు సోమవారం తెలిపారు. గత విద్యా సంవత్సరం పదోతరగతి చదివిన విద్యార్థులలో వెదురుపర్తి వరప్రసాద్ 565 మార్కులతో పాఠశాల స్థాయిలో తృతీయస్థానం సాధించి ఇప్పుడు ఒంగోలు ట్రిపుల్ ఐటీ కి ఎంపికైనట్లు తెలిపారు. పాఠశాల ప్రథమస్థానం సాధించిన జామి ప్రేమ్ కుమార్ నూజివీడు ట్రిపుల్ ఐటికి, ద్వితీయస్థానం సాధించిన మండ మాధురి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటికి ఇప్పటికే ఎంపికవ్వగా ఇప్పుడు తృతీయస్థానం సాధించిన వెదురుపర్తి వరప్రసాద్ ఒంగోలు ట్రిపుల్ ఐటికి ఎంపిక కావడంపై ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

సంతకు అనుమతులిస్తే ఊరుకోం

ప్రజాశక్తి - జామి

జిల్లాలోని ప్రముఖ సంతల్లో ఒకటైన అలమండ సంతకు సరియైన వసతులు కల్పించకుండా అనుమతులు ఇవ్వాలని చూస్తే, గో - సంరక్షణ సమితి చూస్తూ ఊరు కొదని ఆసంస్థ నాయకుడు లోగిస రామకృష్ణ ధ్వజ మెత్తారు. ఇటీవల ప్రజాశక్తి పత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన ఆయన సోమవారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. అలమండ సంత విషయంలో గతం నుంచి ఆందోళన చేస్తున్న గో - సంరక్షణ సమితి ఎప్పటికీ లాలూచీ పడదని వివరణ ఇచ్చారు. రాజకీయాలు ఎలా ఉన్నా, సంతలో తాగునీరు, వసతులు కల్పించే వరకూ పోరాడుతామన్నారు. లొట్లపల్లి సంతపై ఇప్పటికీ అనేక ఫిర్యాదులు ఇచ్చామని, అధికారులపై కూడా విచారణ చేయాలని ఫిర్యాదులు చేశామని చెప్పుకొచ్చారు. ధర్నాలు కూడా నిర్వహించి, అక్రమ అనుమతులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన తాము, ఇప్పటికీ సంతపై చిత్తశుద్ధితో పని చేస్తున్నామని స్పష్టం చేశారు. విలేకర్ల సమావేశంలో గో - సంరక్షణ సమితి నాయకులు చింతలపూడి రుపావతి, కెకెవి సత్యనారాయణ, జి.శాంతి, పైడితల్లి, రవికిరణ్, రాయవరపు ఆదిలక్ష్మి, బంగారయ్య, నాని తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

ప్రజాశక్తి- డెంకాడ

ఐనాడ జంక్షన్, జొన్నాడ ప్రాంతాల్లో సోమవారం ఎస్ఐ ఎ. సన్యాసినాయుడు ఆధ్వర్యంలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి గంజాయి, గుట్కా, ఇల్లీగల్ ఫైర్ క్రాకెర్స వంటివి పరిశీలించారు. రోడ్డుపై వెళుతున్న వాహనాలతో పాటు దుకాణాల్లో కూడా పరిశీలించారు. నిషేధం అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహణ లేకుండా దుకాణాల్లో కూడా తనిఖీలు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

2.4 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- శృంగవరపుకోట

బొడ్డవర చెక్ పోస్టు వద్ద తనిఖీలు చేస్తుండగా గంజాయిని పట్టుకున్నామని ఎస్ఐ గంగరాజు తెలిపారు. తమకు వచ్చిన ముందస్తు సమాచారం ప్రకారం చెక్ పోస్టు వద్ద తనికీ చేస్తుండగా అరకు వైపు నుంచి ద్విచక్ర వాహనంపై కాకినాడకు చెందిన ప్రజ్వల్, ఈతకోట నాని 2.4 కిలోల గంజాయిని అక్రమంగా తరలిస్తు పట్టుబడ్డారని తెలిపారు. వారి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

55 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల పరిధిలోని దుప్పలపూడి గ్రామ సమీపంలో సీరబంద వద్ద అక్రమంగా 55 మద్యం సీసాలు తరలిస్తున్న ఇట్లా మామిడిపల్లి గ్రామానికి చెందిన మాదేటి వినోద్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వెలమల ప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ మద్యం షాపు నుంచి అక్రమంగా ఈ మద్యాన్ని తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బందితో నిఘా వేసి పట్టు కున్నామన్నారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల రవాణా, మద్యం గొలుసు దుకానాల నిర్వహణ చట్ట వ్యతిరేకమని ఇటువంటి పనులు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పట్టుబడిన వినోద్ కుమార్ పై కేసు నమోదు చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఆదర్శనీయం .. కుప్పానాయుడు జీవితం

నేడు కుప్పానాయుడు 12వ వర్ధంతి

ప్రజాశక్తి-గజపతినగరం

ఉన్నత చదువులు చదివారు. గొప్ప గొప్ప ఉద్యోగ అవకాశాలు తలుపు తట్టినా ఆశయం వెంటే ఆయన నడిచారు. త్యాగనిరతికి నిలువుటద్దం. ఆదర్శానికి నిలువెత్తు సాక్ష్యం. నిరాడంబర జీవితం. నిస్వార్థ ప్రజాసేవ ఆయన సొంతం. ఆయనే కామ్రేడ్ కుప్పానాయుడు. కష్టజీవులకండగా... కమ్యూనిస్టు నేతగా.. సిపిఎం నాయకునిగా.. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నేతగా పని చేశారు. ఆయన అంకితభావం ముందు.. కష్టాలు, కన్నీళ్లు నిలువ లేక పరుగులు తీశాయి. ఆయన చొరవ.. త్యాగం.. భవిష్యత్తు తరాలకు ఆదర్శం. పలుమార్లు అనారోగ్యం వచ్చినా ఆయన ఏనాడూ వెరవలేదు. పురిటిపెంటలో ఉంటుండగానే ఓసారి అతిసార, మరోసారి టిబి, ఇంకోసారి మలేరియా వచ్చాయి. టిబి వచ్చిన సందర్భంలో జిల్లా కేంద్రంలో ఉండాలని సిపిఎం నాయకులు కోరినా పేదల మధ్యే ఉంటానంటూ ఆయన ఏజెన్సీలోని పనుకువానివలస వెళ్లిపోయి గిరిజనుల మధ్య ఉన్నారు. ఎన్నో ఉన్నత ఉద్యోగావకాశాలు వచ్చినా వాటన్నింటినీ వదులుకున్నారు. జనం కోసం జనం మధ్యే ఉంటూ వేలాది మంది పేదల ఆదరాభిమానాలు చూరగొన్నారు. నిత్యం పేదల కోసం పరితపించే ఆయన చివరికి ఆ పేదల మధ్యే కన్నుమూశారు. ఆయన నిస్వార్థ జీవితం ఆదర్శప్రాయం. నిరాడంబరత అనుసరణీయం.. గురువారం కుప్పానాయుడు ఎనిమిదో వర్థంతి సందర్భంగా ప్రత్యేక కథనం..

చిత్తూరు జిల్లా పుత్తూరు మండలం రామసముద్రంలో 1948లో ఆదమ్మ, ఎంకంనాయుడు దంపతులకు కుప్పానాయుడు జన్మించారు. పదో తరగతి వరకూ తన స్వగ్రామానికి పక్కనే ఉన్న వేపగుంటలో ఆయన విద్యాభ్యాసం సాగింది. పుత్తూరులో ఇంటర్, ఎస్‌వి యూనివర్సిటీలో డిగ్రీ పూర్తిచేశారు. 1980లో ఆంధ్రా యూనివర్సిటీలో పిహెచ్‌డి పట్టా పొందారు. గిరిజన బతుకులు- నక్సలైటు ఉద్యమాలు.. అనే అంశంపై ఆయన చేసిన అధ్యయనానికి డాక్టరేట్ లభించింది. విద్యార్థి దశలో వామపక్ష భావజాలం వైపు అడుగులు వేసిన కుప్పానాయుడు ఎస్ఎఫ్ఐలో చేరి, విద్యార్థుల సమస్యలపై పోరాడారు. విద్యార్థిగా ఉన్నప్పుడే గ్రామంలో ఉన్న దళితుల స్థితిగతులు పరిశీలించారు. భూమి లేని పేదలు, వ్యవసాయ కార్మికులు పడుతున్న కష్టాలను చూశారు. వారి జీవితాల్లో మార్పు కోసం పనిచేయాలని నిర్ణయించుకున్నారు. పిహెచ్‌డి అనంతరం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అవకాశం వచ్చినా తిరస్కరించి, వెనుకబాటుకు గురై ఉన్న విజయనగరం జిల్లాలో పని చేయాలనుకున్నారు. 1983లో నేరుగా గజపతినగరం మండలం పురిటిపెంట గ్రామానికి చేరుకున్నారు. అక్కడ పేదలు, వ్యవసాయ కార్మికులతో మమేకమై వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు.

సిపిఎం పూర్తికాలం కార్యకర్తగా, జిల్లా కమిటీ సభ్యునిగా కుప్పానాయుడు దీర్ఘకాలం పనిచేశారు. జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేయడంలో కీలకభూమిక పోషించారు. మొట్టమొదటి జిల్లా కార్యదర్శిగా ఎన్నికై ఎన్నో పోరాటాలు చేశారు. కూలి, భూమి, ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు.. ఇలా అనేక సమస్యలపై పేదలను కూడగట్టి పోరాడారు. 1983-85 ప్రాంతంలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం ప్రాంతాల్లో పర్యటించి గిరిజనుల్లో చైతన్యం నింపారు. సారా నిషేధానికి విశేష కృషి చేశారు. అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చేరిన పేదలకు నేనున్నానంటూ వెళ్లి పలకరించి వైద్యసేవలు సక్రమంగా అందేలా చూసేవారు. మెంటాడ మండలం ఆగూరు పంచాయతీలో 1994లో గిరిజనులను కూడగట్టి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన భూపోరాటం చేశారు. అనంతగిరి మండలం గూడెం నుంచి కొంతమంది వచ్చి ఇక్కడ 60 ఎకరాలను స్వాధీనం చేసుకున్నారు. నివాసమే ర్పరుచుకున్నారు. సంఘంగా ఏర్పడి ఏర్పాటు చేసుకున్న ఆ ప్రాంతానికి సంఘం గుడ్డివలస అని నామకరణం చేశారు. తరువాత కలెక్టర్‌ను కలిసి వారికి ఓటుహక్కు, రేషన్‌కార్డులు, భూమికి పట్టాలు సాధించారు. పురిటిపెంటలో కూలి రేట్లు పెంచాలని పెత్తందార్లకు వ్యతిరేకంగా పేదల పక్షాన నిలబడి పోరాడారు. అడ్డంకులు, దాడులు ఎన్ని ఎదురైనా వెనుదిరగలేదు. నేడు పురిటిపెంటలో సాగుచేస్తున్న నాలావారి భూములకు పట్టాల సాధన ఆయన నేతృత్వాన సాగించిన పోరాట ఫలితమే!. కానీ నేటి పాలకులు, అధికారులు నేటికీ రైతులకు ఆ భూములకు సంబంధించి పట్టాలను అందజేయలేదు.

గంగచోళ్లపెంట నుంచి పురిటిపెంటకు సాగునీటి కాలువ కోసం రైతులను చైతన్యవంతం చేసి పోరాడారు. గజపతినగరంలోని మామిడి బంద, సంతతోట పేదల ఇళ్ల స్థలాల కోసం పోరాడి సాధించారు. 1991లో సంభవించిన భారీ తుపానులో మెంటాడ మండలం ఆగూరు వద్ద ఎంఎన్ ఛానల్‌కు పడిన గండిని పూడ్చేందుకు 18 గ్రామాల రైతులను కదిలించి ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టి పూడిక వనులు చేశారు. 1994లో వ్యవసాయ కార్మిక సంఘం తొలి జిల్లా మహాసభలను పురిటిపెంటలో నిర్వహించి జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘం బలోపేతానికి బాటలు వేశారు. అదే ఏడాది మెంటాడ మండలం ఆగూరులో భూపోరాటం చేసి 60 ఎకరాలను దళిత, గిరిజనుల సాగులోకి తెచ్చారు. పెదమేడపల్లిలో ఆకలితో చేనేత కార్మికులు మృతి చెందడంతో అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం నేతలు పాటూరు రామయ్యతో కలిసి నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేసి వాస్తవాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. బీడి ఆకుల ధరలు పెంచాలని మెంటాడ మండలంలోని ఆరు గిరిజన పంచాయతీల్లో ఆందోళన చేపట్టి రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మార్చారు. గుర్లగెడ్డ, ఆంధ్ర గెడ్డ నిర్మాణంలో ఆయన కృషి ఎంతైనా ఉంది. మెంటాడ మండలంలోని గిరిజన గ్రామాల్లో పది ప్రాథమిక పాఠశాలల నిర్మాణానికి కృషి చేశారు. కుల వివక్షకు వ్యతిరేకంగా 1998 లో గజపతినగరం, మెంటాడ, బొండపల్లి మండలాల్లో 50 గ్రామాల్లో వారం రోజులపాటు పాదయాత్ర చేపట్టారు. మెంటాడ మండలం గుర్ల గ్రామంలో దళిత, గిరిజనులు సాగుచేస్తున్న 50 ఎకరాల ప్రభుత్వ భూమికి పట్టాలు అందజేయడమే కాకుండా భూ అభివృద్ధి పథకం ద్వారా నిధుల మంజూరుకు కృషి చేశారు. మరుపల్లి, కొణిశ, మెంటాడ మండలంలోని పనుకువానివలస, ఎర్రొడ్లవలస, రాయవలస, సంఘంగుడ్డివలస, తదితర గిరిజన గ్రామాల్లో 2007లో పెద్దఎత్తున భూపోరాటం నిర్వహించి 600 ఎకరాల ఫారెస్టు, వన సంరక్షణ సమితి భూములను పేదలకు అందేలా చేశారు. 2012 ఆగస్టు 27న ఆయన తుదిశ్వాస విడిచారు.



పురిటిపెంటతో ఎనలేని అనుబంధం

కుప్పానాయుడికి పురిటిపెంట గ్రామంతో ఎనలేని అనుబంధం ఉంది. ఆయన 1983లో పురిటిపెంట వచ్చిన నుంచి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర బాధ్యతలు చూసే వరకూ సుమారు 20 ఏళ్లపాటు ఆ గ్రామంలోనే నివాసమున్నారు. నిత్యం పేదల మధ్యే ఉంటూ వారి పెట్టిందే తినేవారు. పేదల సమస్యలు తెలుసుకుంటూ పరిష్కారానికి కృషి చేశారు. కూలీలు, రైతుల సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశారు. పురిటిపెంటలో ఎంతోమంది యువకులను వామపక్ష భావజాలం వైపు పయనించేలా తీర్చిదిద్దారు.

నేడు వర్ధంతి సభ

కుప్పానాయుడు 12వ వర్ధంతి సభలను గజపతినగరం మండలంలోని పురిటిపెంట దళిత కాలనీలో, మెంటాడ మండలంలోని కుప్పానాయుడువలసలో మంగళవారం ఉదయం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు ప్రాణసంకటం

● రోడ్లకు ఇరు వైపులా పేరుకు పోయిన జంగిల్ ● బయట పడుతున్న విష సర్పాలు ● పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- మెంటాడ

రోడ్లు భవనాల శాఖ అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు ప్రాణసంకటంగా మారింది. ఆంధ్ర - గజపతినగరం ప్రధాన రహదారిలో రోడ్డుకు ఇరువైపులా పెద్దపెద్ద వృక్షాలు, పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. వాహనచోదకులకు రోడ్ల మలుపులు గుర్తించక ప్రమాదాలకు గురవుతున్నారు. జంగిల్ క్లియరెన్స్ చేపట్టాల్సిన రోడ్లు భవనాల శాఖ అధికారులు మిన్న కోవడంతో రోడ్లపై ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలంలో రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు మొలుస్తున్నాయి. వీటికి తోడు రోడ్డు పక్కనే ఉన్న చెట్లు గుబురుగా పెరగడంతో రోడ్లపైకి వాలిపోయి రోడ్లను మూసేస్తున్నాయి.దీంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒకవైపు జంగిల్ మరోవైపు గుంతలు పడ్డ రోడ్లు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఏటా జంగిల్ క్లియరెన్స్ చేయించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వాహన చోదకులు, పాదచారులు ఆరోపిస్తున్నారు. రోడ్లు మరమ్మతులు చేయకపోవడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గజపతినగరం నుంచి ఆంధ్ర వరకు సుమారు 18 కిలోమీటర్లు వరకు రోడ్డుకు ఇరువైపులా విపరీతంగా పిచ్చి మొక్కలు దట్టంగా ఉన్నాయి. వర్షాకాలం వచ్చిందంటే అప్పుడప్పుడు విష సర్పాలు రోడ్లపైకి వచ్చేస్తున్నాయి. దీంతో పలువురు విష సర్పాల కాటుకు గురై మృత్యువాత పడుతున్నారు. గతంలో మెంటాడ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి చంపావతి నది ఒడ్డున కాళ్ల కృత్యాలు తీసుకోవడానికి వెళ్ళగా పాము కాటుకు గురైన సంఘటన తెలిసిందే. ఈ రహదారికి ఆనుకొని కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాల, పశు వైద్య కేంద్రం, ఇళ్ల నిర్మాణాలు ఉన్నాయి. ఒక్కొక్కసారి విష సర్పాలు ప్రవేశిస్తున్నాయని వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణ నష్టాలు జరిగిన సంబంధిత రోడ్లు భవనాల శాఖ అధికారులు రోడ్లకు ఇరు వైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలని కోరుతున్నారు.



రోడ్డుకు ఇరువైపులా వేపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

నగర పంచాయతీ కమిషనర్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ నూతన కమిషనర్‌గా టివిఎస్ విశ్వేశ్వర రావు సోమవారం భాద్యతలు స్వీకరించారు. ఇక్కడ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న టివిఎస్ విశ్వేశ్వర రావు (ఎఫ్ఎసి) కమిషనరుగా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో నూతన కమిషనర్‌ని నగర పంచాయతీ సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ సిబ్బంది పాపయ్య రాజు, ఉమా భాస్కర్, రమణ, రాము తదితరులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్ విశ్వేశ్వరరావు

బెర్మ్ దిగితే బోల్తా పడాల్సిందే..!

● విమానాశ్రయ నిర్మాణ సంస్థ భారీ వాహనాలతో కుంగిన బెర్ములు ● గోతులను పూడ్చేందుకు ముందుకురాని సంస్థ ● ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి - భోగాపురం

విమానాశ్రయ నిర్మాణ సంస్థ భారీ వాహనాల రాకపోకలతో కంచేరు వెళ్ళే రహదారి ఇరువైపులా బెర్ములు భారీగా గోతులు పడ్డాయి. ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే రహదారికి క్రిందకు దిగితే వాహనం బోల్తా పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ గోతులను గుప్పెడు మట్టి వేసి కప్పేందుకు విమానాశ్రయ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టి ముందుకు రాకపోవడం విశేషం. దీంతో ఎదురుఎదురుగా వచ్చే రెండు వాహనాలు తప్పించుకోలేని పరిస్థితి వచ్చింది. దీనిపై ఇటు అధికారులు అటు ప్రజాప్రతినిధులు, నాయకులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. ఆ రహదారిలో ప్రయాణించే సుమారు 20 గ్రామాలకు చెందిన వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

సుమారు ఏడాదిన్నర నుంచి విమానాశ్రయ పనులు జరుగుతున్నాయి. మండలంలోని జాతీయ రహదారిలోని ఏ.రావివలస జంక్షన్ నుంచి చేపలకంచేరు వెళ్ళే రహదారిలో విమానాశ్రయ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టికి చెందిన భారీ వాహనాలు రాకపోకలు చేస్తున్నాయి. హైవే నుంచి సుమారు 9 కిలో మీటర్ల దూరంలో కంచేరు వద్ద ఈ సంస్థకు చెందిన ప్రధాన గేటు ఉంది. ఈ గేటులో నుంచే భారీ వాహనాలు లోపలకు వెళ్తుంటాయి. ముఖ్యంగా ఆయిల్ ట్యాంకర్లు, లోపల భవనాలు నిర్మించేందుకు వందల టన్నులతో ఐరన్, సిమెంటు, భారీ వాహనాలు ఈ రహదారి నుంచే రాకపోకలు చేస్తున్నాయి. ఈ భారీ వాహనాల రాకపోకలతో రహదారికి ఇరువైపులా ఉన్న బెర్ము పూర్తిగా గోతులమయంగా మారింది. ఎదురుగా ఏదైనా వాహనం వస్తే బెర్ము దిగేందుకు వాహనదారులు భయపడుతున్నారు. రాత్రి వేళలో అయితే మరింత ఇబ్బందులు పడుతున్నారు. చాలా మంది ద్విచక్ర వాహనదారులు కూడా బోల్తా పడుతున్న సంఘటనలు ఉన్నాయి. ఏ.రావివలస గ్రామం మలుపు వద్ద భారీ గొయ్యి ఏర్పడడంతో ప్రయాణికులు మరింత ఇబ్బంది పడుతున్నారు.



ఏ.రావివలస మలుపు వద్ద కిందకు దిగిపోయిన రోడ్డు బెర్మ

రహదారివైపు కన్నెత్తి చూడని ఎల్ అండ్ టి సంస్థ

ఈ రహదారిలో కేవలం ఎల్ అండ్ టి సంస్థ వాహనాలతోనే ఈ పరిస్థితి ఏర్పడిన విషయం అందరికి తెలిసిందే. రహదారికి ఇరువైపులా ఏర్పడిన చిన్న చిన్న గోతులను మట్టితో కప్పేందుకు విమానాశ్రయ నిర్మాణ సంస్థ ముందుకు రాకపోవడం విశేషం. విమానాశ్రయ పనులు ప్రారంభం కాకముందు ఈ రహదారి బాగానే ఉన్నప్పటికి పనులు ప్రారంభమైన తరువాతే ఈ పరిస్థితి ఏర్పడిందని వివిధ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ గోతులను పూడ్చకపోతే భారీ వాహనాలను అవసరమైతే అడ్డుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఇటీవలి ఈ సంస్థ ప్రతినిధులతో జనసేన నాయకులు కాకర్ల పూడి శ్రీనివాసరాజు, మట్టా అయ్యప్పరెడ్డి తదితరులు వెళ్ళి ఈ రహదారిని వెడల్పు చేసే విషయంపై చర్చించినట్లు చెబుతున్నారు. ఈ రహదారిని గతంలో వంద అడుగులతో భూసేకరణ చేశారని అందుకు వందడగుల రహదారిని నిర్మించేందుకు ఎమ్మెల్యేతో మాట్లాడడం జరుగుతుందని కాకర్లపూడి శ్రీనివాసరాజు అన్నారు. బెర్ముల విషయం కూడా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు.

క్వారీ లారీలతో రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలో ప్రధాన రహదారి గుండా క్వారీ లారీలు అధిక బరువుతో ఒకదాని వెనుక ఒకటి రావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు తప్పుకోవడానికి వీలు లేకుండా పోతుంది. దీంతో ఉదయం 9.30 గంటల సమయంలో పాఠశాలలకు వెళ్లి బస్సులు ఆటోలు, విద్యార్థులు ఇరుకు రోడ్డుపై ప్రయాణించడానికి ఇబ్బందులు పడుతున్నారు. అసలే ఇరుకు రోడ్డు కావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



రోడ్డుపై నిలిచిపోయిన భారీ లారీ

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

జిల్లా వ్యాప్తంగా సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో శ్రీకృష్ణుని విగ్రహాలను ఊరేగించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో చిన్నారుల వేసిన వేశధారణలు ఆకట్టుకున్నాయి. వేపాడలో చిన్నారులు ఉట్టికొట్టి సంబరాలు చేశారు. - ప్రజాశక్తి- యంత్రాంగం



వేపాడ : ఉట్టికొడుతున్న చిన్నారి



శృంగవరపుకోట: వివిధ వేశధారణలో చిన్నారులు



కృష్ణుడు, గోపిక వేశధారణలో పిల్లలు



నెల్లిమర్ల: శ్రీకృష్ణుడి ఊరేగింపు

ఇవిఎంల తనిఖీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు, నెల్లిమర్ల ఇవిఎం గోదాంలో గజపతినగరం అసెంబ్లీ, విజయనగరం పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని నెల్లిమర్ల, బొబ్బిలి సెగ్మెంట్‌లకు చెందిన 3 ఇవిఎంలను రెండు రోజులపాటు నిర్వహించే తనిఖీ ప్రక్రియను సోమవారం ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్ర శేఖర్ ఎన్నికల కమిషన్‌కు చేసిన దరఖాస్తు మేరకు, ఇవిఎంలను తనిఖీ చేయాలని ఈసి ఆదేశించింది. ఈ మేరకు గోడౌన్లోని గజపతినగరం నియోజకవర్గం పీఎస్ నంబర్ 20 ఇవిఎంను, జిల్లా ఎన్నికల అధికారి, ఎన్నికల కమిషన్ నియమించిన భెల్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో, మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య ఏజెంట్ సమక్షంలో తనిఖీ చేశారు. ఈ ప్రక్రియ సజావుగా, సక్రమంగా, ఎటువంటి అవాంతరాలు లేకుండా నిర్వహించారు. ఈ ప్రక్రియను జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, డిఆర్ఓ ఎస్.డి.అనిత పరిశీలించారు. సిబ్బంది పాల్గొన్నారు.



ఇవిఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్